దేన్నో పొందానన్న అనిర్వచనీయమైన సంతోషం. మరిదేన్నో కోల్పోయానన్న అవ్యక్తమైన బాధ, గుండె గోడల్ని తడుముతున్నాయి. 'కుఛ్ పానాహైతో కుఛ్ ఖోనాహై' సినిమా పాట గుర్తుకు వచ్చింది.


ఔను, దేన్నైనా పొందాలంటే మరి దేన్నో కోల్పోక తప్పదేమో! జీవితమంటే అదేనేమో!

చెన్నైలో చిన్నాణ్ణి అమెరికా ఫ్లైట్ ఎక్కించి రైల్లో గుంటూరు చేరి ఇంటి తాళం తీస్తుంటే మనసు బావురుమంది. టెన్త్ పాసైనప్పట్నుంచీ, ఇంటర్ ఎమ్‌సెట్ ఇంజనీరింగ్ ఇలా ఏడెన్మిదేళ్ళు వాడు వాడుకున్న స్కూటీ నావంక జాలిగా చూస్తున్నట్లు అనిపించింది. వాడి రీడింగ్ రూము, వాడు వదిలేసిన పుస్తకాల దొంతరలు నిశ్శబ్దంగా నిట్టూరుస్తున్నట్లనిపించింది.

ఆడపిల్లల్ని కని, పెంచి పోషించి, కంటికి రెప్పలా కాపాడుకుని ఓ అయ్య చేతుల్లో పెట్టి కాపురానికి పంపే సమయంలో ఆడపిల్లల తల్లిదండ్రులు పొందే అనుభూతి, ఓహ్ వర్ణనాతీతం. అదో చిత్రమైన ఓ మెత్తని రంపపుకోత. ఆడపిల్లలు లేని నాకు భగవంతుడా అనుభూతినిలా కల్పించాడేమోననిపించింది.

ఇవేమీ పట్టనట్టు రాధ, ఉహూ ఇంకేం రాధ. పెళ్ళికెదిగిన ఇద్దరు కొడుకుల తల్లి, రాధ కాదు

# కుఛ్ పానాహైతో...




**శ్రీదత్తప్రసాద్ పరమాత్ముని**

రాధమ్మ ఇల్లు సర్దుకోటంలో, నిన్న చెన్నై వెళ్తూ హడావుడిగా వదిలేసిన గిన్నెల్ని కడుక్కోటంలో, తుడుచుకోటంలో నిమగ్నమైంది. ఏం, తనకు నాకున్నపాటి స్పందన ఉండదా? ఎందుకుండదు? నాకన్నా ఎక్కువే ఉండి ఉంటుంది. ఐనా స్పందించటానికి, తీరిగ్గా భావుకత్వాన్ననుభవించటానికి కూడా టైముండాలి. పనీపాటలేనమ్మ పాతికేళ్ళనాడు పెళ్ళిలో మేనమామ పెట్టిన ఉంగరం పదేళ్ళ క్రితం గోదావరి పుష్కరాల్లో నదీస్నానం చేస్తుంటే జారిపోయిన వైనాన్ని తల్చుకొని నింపాదిగా స్పందిస్తుందట. హడావుడిగా ఆఫీసుకు టైమైందని పరిగెత్తే భర్తకు మనసేలేదని, స్పందనలసలే లేవని, తనపై ప్రేముంటే కదా, తాను పారేసుకున్న ఉంగరంపై ప్రేముంటానికని ఎద్దేవా చేస్తూ, తన బ్రతుకిలా తయారైనందుకు బాధపడ్తూ మొగుడు కొనిపెట్టిన మూడుంగరాల్ని సింగారించుకున్న చేతివేళ్ళతో కళ్ళొత్తుకుంటుందట. నవ్వో

చ్చింది. తన పరిస్థితీ అదేనేమో! ఐనా చిన్నాడెక్కడికెళ్ళాడని? యోగ్యుడై ఏడాదికి లక్ష డాలర్ల ఉద్యోగం చేసుకోటానికి అమెరికా వెళ్ళాడు. నిజమే అనంతమైన తృప్తి. గర్వంతో ఎద పొంగింది. ఆ తృప్తి పక్కనే ఇంకా కొన్నేళ్ళు కనిపించడేమోనన్న సన్నని బాధ గుండెల్లో ముల్లుగుచ్చుకొంది. సుఖంలో దుఃఖం, దుఃఖంలో సుఖం, భలే విచిత్రమైన అల్లిక, సొగసైన కూర్పు ఈ జీవితం.

''అన్నంలోకేం చేయమంటారు? నాలుగు వంకాయలున్నాయి. ఓ చిన్న సొరకాయ ముక్క ఉంది. సొరకాయ కూర చేసి వంకాయ పచ్చడి చేయమంటారా? సొరకాయ పప్పుచేసి వంకాయ కూర చేయమంటారా?'' పడక్కుర్చీలో పడుకుని ఆలోచనల అమృతసాగరంలో మునకలేస్తున్న తన భుజం తడుతూ అడిగింది రాధ.

'ఏదోటి తగలై, రేపు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో పెద్దపీట విద్యకు వేయమంటారా? పల్లెల ప్రగతికి పెద్ద పీట వేయాలా? అని ఆర్థికమంత్రి సతమతమవుతూ అడిగినట్లుగా ఉంది నీ వంట తతంగం' అని అందామనుకుని నొచ్చుకుంటుందేమోనని నిగ్రహించుకుని ''ఏదో ఒకటి చెయ్ రాధా'' అని అంటూండగానే మళ్ళీ ఆలోచనల్లోకి మనసు పరుగెత్తింది.

కన్నందుకు, రెండు కళ్ళల్లో, అహ కాదు కాదు నాలుగు కళ్ళల్లో పెట్టుకుని పెంచుకున్నందుకు, చాలీ చాలని జీతంతో, అప్పుల్తో తిప్పల్తో కష్టపడి చదివించుకున్నందుకు ఇద్దరూ యోగ్యులయ్యారు. ఇంజనీర్లయ్యారు. పెద్దాడు బెంగుళూర్లో పెద్దగా కాకపోయినా జీవితంలో అడుగుపెట్టటానికి సరిపోయే సంపాదనలో స్థిరపడ్డాడు. చిన్నాడు సరేసరి, సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా మధ్యతరగతి కుటుంబీకుల కలలుగనే స్వాప్నిక లోకమైన అమెరికాకు తరలివెళ్ళాడు. ఇంక దిగుల్లేదు. నిదానంగా అప్పులు తీర్చుకుని తన అభిరుచికనుగుణంగా ఓ అందమైన ఇల్లు ఏర్పరచుకోవచ్చు. నిదానంగా పిల్లల పెళ్ళిళ్ళు చేయచ్చు. ఔనూ పెళ్ళిళ్ళంటే గుర్తుకు వచ్చింది. తనకు దక్కినట్లు కాకుండా నెత్తిన పెట్టుకుని గౌరవించే, ప్రేమించే అత్తమామల్ని వెదకాలి. విద్యల్లో శారదల్ని గాలించి కోడళ్ళుగా తెచ్చుకోవాలి. సంస్కారంలో విశారదల్ని వెతికి పట్టుకోవాలి. వాళ్ళకు పెళ్ళిళ్ళు చేసి ఏ కాశీలోనో రామేశ్వరంలోనో స్థిరపడాలి. పిల్లలమీద ఆధారపడకుండా హుందాగా శేషజీవితాన్ని గడిపే ఆర్థిక స్తోమతును పెంచుకోవాలి.

''వంటయింది, భోజనానికి రండి'' మళ్ళీ ఆలోచనా స్రవంతికంతరాయం. మనసు పన్నీటి స్నానం చేస్తున్నా తనువుకు చన్నీటి స్నానం తప్పదనుకుంటూ స్నానం చేసాను. అసలు తనకైతే ఏమీ తినాలని అనిపించటం లేదు. మెరిసే ఆలోచనల మిరపకాయ బజ్జీల్నే కొరుక్కు తినాలని ఉంది. ఐనా చేసిన వంటకాలన్ని తృప్తిగా తినకపోతే రాధ నొచ్చుకుంటుందని ఏవో నాలుగు మెతుకులు నంజుకుని భోజనమైందనిపించాను.

భోజనం చేసి మంచంపై మేను వాల్చాను. ఇంక నిద్రకుపక్రమించాలి. అసలే తనకు నిద్రరాదు. రోజూ పన్నెండు, ఒంటి గంటయితే కానీ నిద్రపట్టదు. తన జీవితమో అందమైన మలుపు తిరిగిన రోజు, తన అందమైన కల వాస్తవమైన రోజు, ఇంకేం నిద్రపడ్తుంది. అమెరికా చేరి చిన్నాడు ఫోన్ చేసేదాకా ఎదురు చూపులే.

తాను భోజనం చేసి వంటిల్లు సర్దుకుని వచ్చింది రాధ. మంచమెక్కబోతూ ఏమనుకుందో ఏమో పక్కనున్న టేబుల్ సర్దసాగింది. ఈ పక్కనున్న పెన్నుల్ని ఆ పక్కన పెట్టింది. ఆ పక్కనున్న గడియారాన్ని ఈ పక్కన సర్దింది. చిందరవందరగా పడేసిన మాగజైన్లను న్యూస్‌పేపర్లను కుదటగా సర్దింది. ఇద్దరు పిల్లలూ జంటగా తీయించుకున్న ఫోటోను ఒక చేత్తో పట్టుకుని రెండో చేత్తో చీరకొంగుతో తుడవసాగింది. రెండు చేతుల్నే నాలుగు చేతులుగా నలభై చేతులుగా చేసి ఎత్తుకొని పెంచుకున్న పిల్లల ఫోటోను ఆప్యాయంగా చూడసాగింది, తుడమసాగింది.

ఔను కన్నతల్లి, విజయహారాన్ని చేకొన్న తల్లి, అలా చూస్తున్న రాధ కనుకొనల్లో చిక్కి ఎడదను నొక్కి గిలిగింతలు పెడుతూ, చెక్కిలిపైకెక్కిన కన్నీటి బిందువుల్ని, ఆనందబాష్పాలను కొంగుతో వత్తుకుని అంతులేని భావతరంగాల్ని గుండెలో కుక్కుకుని పక్కపైకెక్కింది రాధ. తననే గమనిస్తున్న నన్ను గమనించకుండా నేను నిద్రపోయాననుకుని తానూ పక్కన వొత్తిగిల్లింది. కొద్దిసేపట్లోనే నిద్రలోకి జారిపోయింది. అలసిన తనువు ఎంత అలిసినా అలుపెరుగని మనసును జయించి నిద్రపోయింది.

నాకా ప్రాప్తం లేదు. తనకు స్పందన లెక్కువ. స్పందించటానికి తీరుబాటెక్కువ. కాలేజీ లెక్చరర్ని కదా. అందునా తెలుగు లెక్చరర్నికదా. కవితల్ని కథల్ని కాకరకాయల్నీ పాఠాలుగా చెప్తూ ఆలోచిస్తూ, పిల్లల్ని ఆలోచింపచేసే ఉద్యోగం కదా. ఆలోచించటానికి తీరికెక్కువ. ఇలా ఆలోచిస్తూ ఆలోచిస్తూ, గతించిన కాలపు స్మృతుల్నీ, భవిష్యత్తు ఆశల్నీ వర్తమానంలో కలిపి అవలోకిస్తుండగా నిద్రపట్టసాగింది. మనస్సు ప్రపంచ భారాన్ని విడిచి తమస్సులో తలదాచుకోసాగింది. అలా నిద్రపడుతూ పడుతూ ఉన్న దశలో పక్కకు తిరిగినప్పుడు రాధపై నా కాలు పడింది. బద్ధకంగా ఇటు తిరిగింది రాధ. నిద్రించే రాధ చెక్కిలిపై అధరాల ముద్రలుంచాను. దగ్గర కొచ్చిన నిద్ర చెది




## నేత్రానందం

**కరీనా కపూర్, మనీషా కొయిరాలా, సల్మాన్‌ఖాన్‌లు కలిసి నటిస్తే చూడాలని ఉందా? అయితే మీ కోరిక త్వరలో నెరవేరబోతోంది. ప్రీతిష్‌నందీ కొత్త చిత్రం 'సాహిబ్ బీవీ ఔర్ గులాం'లో ఈ త్రయం నటించి మీకు కనువిందుచేయనున్నారు. ఈ చిత్రానికి సంబంధించి షూటింగ్ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. కరీనా, సల్మాన్‌ల ఫ్రెండ్షిఫ్ గురించి కతలు కతలుగా చెప్పుకుంటున్న సినీ జనానికి ఈ వార్త ఇంకా ఆనందాన్నిస్తుందంటున్నారు. 'బాజీరావ్ మస్తానీ', 'మేరీగోల్డ్'లో కలిసి నటించిన కరీనాకి సల్మాన్‌తో ఎలాంటి అనుభవం ఎదురైందో త్వరలో తెలుస్తుందని ఇండస్ట్రీ జనం అంటున్నారు.**

రింది. బెదిరి పారిపోయింది. రాధ చెక్కిలిపై మరో ముద్దు. ఒకనాడు నిగనిగలాడే రాధ చెక్కిలి సన్నని ముడతల్ని సింగారించుకున్నా సుకుమారంగానే ఉంది. ఈమధ్యకాలంలో ఏనాడూ చూడని సునిశితమైన చూపుల్తో ఆమె తనువును తడమసాగాను. నల్లని కురుల్లో అక్కడక్కడా తెల్లని అనుభవాలు తీగలు సాగుతున్నాయి. శంఖంలాంటి మెడపై బాధ్యతల బరువుల్ని మోసిన నిశ్శబ్ద రాగాలు చారలు చారలుగా పొర్లుతున్నాయి. ప్రక్కకొత్తిగిల్లినప్పుడు పొట్టపై పడే ముడతల్లో గాంభీర్యం చోటు చేసుకుంది. ఆ గాంభీర్యంలో తన బిడ్డలు శిశువులుగా కాళ్ళతో తొక్కిన పాదాల గుర్తులున్నాయి. హత్తుకున్న పసి చేతుల చిహ్నాలున్నాయి. ఇంత వయసు వచ్చినా, వయసు వృద్ధాప్యపు నీడల్లో సేదతీర్చుకుంటున్నా రాధ అందంగానే ఉంది. భర్తను రెచ్చగొట్టగల హుందాతనంతో కూడిన సౌందర్యం ఆమెలో పడగలెత్తే ఉంది.

ఐనా రాధను తానా 'దృష్టి'తో చూసి కొన్నేళ్ళయింది. తమ ముప్పై ఏళ్ళ దాంపత్యంలో గడిచిన ఇరవై ఏళ్ళలో శృంగార జీవితం దాదాపు మరుగున పడ్డదనే చెప్పాలి. శృంగారమనేది ఈ ఇరవై ఏళ్ళలో ఏదో యాంత్రికంగా లాంఛనంగా మాత్రమే జరిగిపోయింది. ఒక మొక్కుబడిలా జరుపుకోక తప్పని ఒక బాధ్యతలా మారిపోయింది. పిల్లలూ, వాళ్ళ చదువులూ, రాత్రి పొద్దుపోయేవరకు వాళ్ళు చదువుకుంటుంటే వాళ్ళకు హార్లిక్సులు, టీలు అందించటం, నిరంతరం వాళ్ళను ప్రోత్సహించటం, ఇదే వ్యవహారంలో ఈ ఇరవై ఏళ్ళు సాగిపోయాయి. పెళ్ళైన కొత్తల్లో తొలి పదేళ్ళలో కాలం ఓ నందనవనంలా, ఓ వసంతంలా, ఇరు సంధ్యల మధ్యకాలం ఓ అందమైన బృందావనంలా గడిచిపోయింది. తర్వాత తర్వాత పిల్లలు పెద్దవాళ్ళవుతున్నకొద్దీ జీవన సరళి మారిపోయింది. డబ్బూ, దస్కం, పిల్లల ట్యూషన్లు, వాళ్ళ మార్కులు, వాళ్ళ రాంకులూ, వాళ్ళ సీట్లూ, రాబోయే డిగ్రీలు ఇదే జీవితమైంది.

తనకు చాలా గర్వమనిపించింది. ఇదో నిజమైన పర్వమనిపించింది. ఈ పర్వాన్ని పండుగగా పరువాల పండుగగా జరుపుకోవాలి. ఆ ఆలోచన రాగానే మనసు ఉలికిపడింది. వయసు తగ్గినట్లనిపించింది. ఆదరంగా రాధపై చెయ్యివేసాను. అనురాగపు ఆలింగనంలో ఇమిడిపోయాను. నిద్రలోనే రాధ స్పందిస్తూ క్రమంగా నిద్రాదేవి కౌగిళ్ళను వీడి నా కౌగిలింతల్లోకి వచ్చి నన్ను కమ్మేయసాగింది. రాధ ప్రతిస్పందనలో ఉవ్వెత్తున ఎగిసిపడే ఆవేశపుటలలు లేవుకానీ, ప్రశాంతంగా సాగే పలకరింతలున్నాయి. చెట్లనూ చేమల్నీ ఊపేసే సుడిగాలి పరవళ్ళు లేవు కానీ, ధీరగంభీర మందవాయువుల కైపులున్నాయి.

తాను రాధను, రాధ తనునూ ఆశ్రయించుకున్న తరుణంలో తమ తనువుల్లోని అణువణులో ఇన్నాళ్ళూ దాచిన రహస్యాల మూటల్ని విప్పుకున్నట్లయింది. తమ అధరాల పలకరింపుల్లో, తమ ఆలింగనాల ఊరడింపుల్లో, తమ ఉచ్ఛ్వాస నిశ్వాసాల హేలల్లో జోరులేదు. నెమళ్ళ నడకలున్నాయి. చిలకల గోర్వంకల పల్కరింపులున్నాయి.

''ఏమండీ ఫోను మోగుతోంది. ఏమండీ ఫోను'' అన్న కేకలాంటి రాధ స్వరం గట్టిగా గుండెల్ని కుదిపే తేనే కాని నేనీ లోకంలోకి రాలేదు. నా కౌగిట్లోంచి విదిల్చుకొని రాధ ఒక్క ఉదుటున దూకినట్లుగా మంచం దిగి ఫోనెత్తి ''హలో'' అంది.

మాటలవల్ల ఆ ఫోను అమెరికా నుంచేనని నాకర్థమైంది. దాదాపు పావుగంట మాట్లాడింది రాధ. చివరకు ''ఒరే నాన్న ప్రక్కనే ఉన్నారు. మాట్లాడు'' అని రిసీవర్ నాకందించింది.

చిన్నాడి కంఠధ్వని. వేల మైళ్ళ దూరాన్నుండి, సాగరాల్ని దాటుతూ, దేశాల్ని దాటుతూ ప్రయాణించి వినిపించసాగింది. తన ప్రయాణం, తన అనుభవాలు, లండన్‌లో కొద్దిగంటల హాల్టు, దేశ విదేశస్థులతో ఫ్లైట్లో, హాల్ట్‌టైమ్‌లో తన సంభాషణలు, అక్కడికి చేరుకున్న తర్వాత తన్ను రిసీవ్ చేసుకోటానికి వచ్చిన మిత్రుల వివరాలు, తాను చేరుకున్న అందమైన అపార్ట్‌మెంట్ సంగతులు, ఇలా ఒకటేమిటి ఇరవై నాలుగు, ఇరవై ఐదు గంటల తన అనుభవాన్నంతా బ్రీఫ్ రన్నింగ్ కామెంటరీగా, ఓ అరగంటలో చెప్పింది చెప్పకుండా చెప్పాడు చిన్నాడు.

చిన్నాడు ఫోన్ పెట్టేసిన తర్వాత వాడు నీతో ఏం మాట్లాడాడంటే నీతో ఏం మాట్లాడాడని రాధా నేను చెప్పుకున్నాం. తాను చెప్పిన జాగ్రత్తల గురించీ, ఆరోగ్యం గురించీ మరీ మరీ చెప్పినట్లు రాధ చెప్పింది. కొత్త దేశం, కొత్త వాతావరణం, కొత్త పరిచయాలు, ఉరకలు వేసే వయసు, ఎలా వ్యవహరిస్తాడోనన్న ఆందోళనను ఇద్దరం వ్యక్తపరుచుకొని పంచుకొని 'ఆ, ఏం ఫరవాలేదులే' వీడొక్కడే కాదుగా ఈరోజుల్లో కొన్ని వేలమంది విదేశాలకు వెళ్తున్నారు. చక్కగా మసలుకొని తప్పక మంచిపేరు తెచ్చుకుంటాడని ఒకరినొకరం ఊరడించుకున్నాం. ఆప్యాయంగా ఒకళ్ళకొకళ్ళం అక్కున చేర్చుకున్నాం. బిగికౌగిళ్ళలో సేద తీర్చుకునే ప్రయత్నం చేస్తూ ఆనందసాగరంలో తిరిగి నౌకావిహారం చేయసాగాం. ఎవరికేం కావాలో ఇద్దరికీ తెలుసు. అనుభవసారాన్ని పల్లకీనెక్కించి, చెరో పక్క మోస్తున్నాం. సగంలో ఆగిన రాసక్రీడాధ్యాయ అధ్యయనం తిరిగి ప్రారంభమైంది. నింపాదిగా మొదలైన నడక వేగాన్ని పుంజుకోసాగింది. వేగాన్ని పుంజుకుంటున్న అడుగుల సవ్వడి మళ్ళీ ఫోను రణగొణధ్వనిలో ఆగిపోయింది.. ''హలో'' అన్నాను. అవతలి నుంచి పెద్దాడి గొంతు బెంగుళూరు నుంచి. తాను చెన్నై నుండి బెంగుళూరు చేరిన వివరం, ఇప్పుడే అందుకున్న తమ్ముడి ఫోన్ విశేషాలు, మాతో తమ్ముడేం చెప్పిందీ తెలుసుకోటం, మధ్యలో సూచనగా తనకూ అమెరికాలో జాబ్ ట్రై చేయమని చెప్పావా లేదా అని అడగటంలో ఆరాటం, ఓ పది నిముషాలు సాగింది సంభాషణ. కాసేపు నేను, కాసేపు రాధ. పెద్దాడితో మాట్లాడి ఫోన్ పెట్టేశాం.

హఠాత్తుగా రాధ వంక చూస్తే అప్పుడర్థమయ్యింది. రాధ వాలీవాలని నా లుంగీతో తన దేహాన్ని కప్పుకుంది. మరి నేనో, పక్కమీది దుప్పట్నే లుంగీగా చుట్టుకున్నాను. ఇద్దరం ఒకళ్ళనొకళ్ళను చూస్తూ నవ్వుకున్నాం. నిద్రలేమివల్ల, తీరని కాంక్షవల్ల ఎరుపెక్కిన నాలుగు కళ్ళల్లో, ఆగిన ఉద్యమాన్ని కొనసాగించాలన్న ప్రచ్ఛన్న సంకేతాలు వెల్లివిరిసాయి. పిల్లలతో మాట్లాడామన్న ఆనందంతో పెల్లుబికిన మానసాలు మళ్ళీ పెనవేసుకున్నాయి.

ఇంతలో 'అమ్మా, పాలు' పాలమనిషి కేక చెవుల్లో గింగురుమంది. టైం చూస్తే ఐదుంబావయింది. ఇంక లేవనీయండంటూ రాధ నా బాహు బంధం నుండి తప్పించుకుని శృంగార భావాల నా పువ్వుల లుంగీని విడిచి తన చీరను కట్టుకుని తలుపు తీసి పాలు పోయించుకోటానికి బయటికి వెళ్ళింది.

పాలమ్మాయి, తర్వాత పేపరబ్బాయి, తర్వాత పనిపిల్ల, ఆ పిదప కూరలబండి, స్నానం, పూజ, వంట, తర్వాత కాలేజీ, ఇంకేముంది ఈనాటికి ప్రణయాధ్యాయం ముగిసినట్లే.

ఎన్నో ఏళ్ళ తర్వాత దక్కిన 'ఏకాంత సేవ' అర్ధాంతరంగా ఆగినందుకు కొంత బాధగా ఉన్నా, ఏదో తృప్తి ఆ బాధను దిగమింగేసింది. ఏదో పొందామన్న తృప్తి, మరిదేన్నో కోల్పోయామన్న అసంతృప్తి. ప్రణయక్రీడ జీవితంలో ఓ భాగమేగా, కాకపోతే అందమైన భాగం, ఐతేనేం, రసభంగం జరిగినా పిల్లలతో మాట్లాడామన్న తృప్తి ఆ రసభంగ పర్వాన్ని కూడా రసమయం చేసింది. ఔను, మళ్ళీ గుర్తుకు వచ్చింది... ''కుచ్ పానా హైతో, కుచ్ ఖోనా హై!'' ☆

